క్లుప్తంగా

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సీతానగరం: స్థానిక ఎమ్మార్సీ భవనంలో యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం ప్రశాంతంగా జరిగింది. యూటీఎఫ్ జిల్లా పరిశీలకుడు భాస్కరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా పల్లె శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బి.ప్రసాదరావు, సహాధ్యక్షుడిగా టి.అప్పలనాయుడు, అధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, కూనలక్ష్మి, కోశాధికారిగా డి.వెకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

255 మందికి ఆరోగ్య తనిఖీలు



వైద్యసేవల కోసం క్యూ లైన్‌లో ఉన్న రోగులు

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో బొబ్బిలి ఎన్‌ఆర్‌వి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్పెషలిస్టు వైద్యులు పి.రామ్‌కుమార్, డి.వి.సాంబశివరావు, రంగనాథ్ రెడ్డితో పాటు మరో ఆరుగురు వైద్యులు దాదాపు 255 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ



జిల్లేడు కషాయం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు

పార్వతీపురంటౌన్: తూటికాడ కషాయంతో వరి పంటలో వచ్చే దోమపోటు తెగులును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు తెలిపారు. శనివారం మండలంలోని బాలగుడబ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి సేద్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి పంటకు వేసే పొటాష్‌కు ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసే జిల్లేడు ఆకు కషాయం వాడవచ్చన్నారు. రైతులంతా ప్రకృతి సేద్యం చేయాలని, దేశీ విత్తనాలను వినియోగించాలని కోరారు. అనంతరం జిల్లేడు, తూటికాడ కషాయాల తయారీని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

గుమ్మలక్ష్మీపురం: గ్రామంలో నిర్వహించే దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీశంకరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 8 గంటలకు దేవీ విగ్రహం ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఊరేగింపులో గ్రామస్తులంతా పాల్గొనాలని కోరారు.

తుప్పల తొలగింపు



రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగిస్తున్న యువత

సీతంపేట: జగనన్న స్వచ్ఛసంకల్పంలో భాగంగా పీఠ ఈతమానుగూడ నుంచి బంజారుగూడ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలను స్థానిక యువత శ్రమదానం చేసి తొలగించారు. రోడ్డుకు రెండు వైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందుకే వాటిని తొలగించినట్లు యువకులు తెలిపారు.

తోటకూర మొక్క @12 అడుగులు



ఇంటి పెరట్లో ఏపుగా పెరిగిన తోటకూర మొక్కను చూపుతున్న రవికుమార్

వీరఘట్టం: స్థానిక సాండివీధిలో నివాసం ఉంటున్న నల్లాన రవికుమార్ ఇంటిలో ఉన్న తోటకూర మొక్క 12 అడుగుల ఎత్తు పెరిగి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా తోటకూర మొక్క అడుగున్నర ఎత్తు వరకు పెరుగుతుంది. అయితే రవికుమార్ ఇంట్లో ఉన్న తోటకూర మొక్క ఏపుగా పెరుగుతూ విత్తనాలు అందిస్తుండడంతో దాన్ని తొలగించకుండా అలాగే పెంచుతున్నట్లు చెప్పారు. ఈ మొక్కను చూసేవాళ్లంతా అయిబాబో ఎంత పొడుగో.. అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

గిరిశిఖర గ్రామాల్లోనూ..

ఇంటింటికీ తాగునీరు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

గిరిశిఖర గ్రామాల్లో సైతం ఇంటింటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని చినమరికి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.15 లక్షల నిధులతో చేపట్టే ఈ నిర్మాణం ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి పండగ నాటికి ఈ పనులు పూర్తి చేసి, ప్రజావినియోగంలోకి తీసుకువస్తామన్నారు. అలాగే గ్రామంలో అవసరమైన చోట సీసీ రోడ్లు నిర్మించడం జరుగుతోందన్నారు. గ్రామీణులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ బి.రవికుమార్, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, ఆత్మ చైర్మన్ వై. తిరుపతిరావు, సర్పంచ్ గంగ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో ఉన్న రాజుగారి కోట ప్రాంతంలోని కాలనీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం భూమిపూజ చేశారు. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణంతో పాటు పైపులైన్ పనులు కూడా చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత 40 ఏళ్లలో కాలనీ వాసులు అభివృద్ధి చూడలేదని, ప్రస్తుత వైఎస్సార్ సీపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి, ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను మెచ్చుకుంటున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్ మజ్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సీతానగరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు ఆకాంక్షించారు. శనివారం స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు షాపింగ్ మాల్‌ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కుటీర పరిశ్రమల ఏర్పాటు ద్వారా సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఆర్థిక వనరులు సమకూరుస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల కేంద్రంలోని పొదుపు సంఘాల భాగస్వామ్యంతో షాపింగ్ మాల్‌ల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు. సంఘ సభ్యులు కూడా ప్రభుత్వ అవకాశాలతో చిన్న చిన్న వ్యాపారులు సాగించి, తద్వారా వచ్చిన ఆదాయంతో పిల్లల విద్యాప్రగతికి కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వీవోఏల సమక్షంలో గ్రామసభలు నిర్వహించి, బిజినెస్ మార్ట్‌ల ఏర్పాటుకు సభ్యులందరికీ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి, సభ్యత్వ నమోదు కూడా చేపట్టడం జరిగిందన్నారు. కొన్ని గ్రామాల్లో స్త్రీనిధి ద్వారా ఇళ్ల వద్దనే కుటీర పరిశ్రమల ఏర్పాటు చేసుకున్నారన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీరాములు

తెగుళ్లపై అప్రమత్తం

వంగర: వరి పంటకు ఆశిస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ తట్టికోట కన్నబాబు సూచించారు. మండల పరిధిలోని జగన్నాథవలస లో వరిపంట పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటకు సోకే వ్యాధులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. దోమపోటు సోకే పంటకు మోనోక్రోటోపాస్ 350 మిల్లీలీటర్లు లేదా ఎ సిఫేట్ 400 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పాముపొడ తెగులు, కాండంకుళ్లు తెగులు సోకే పంటలకు హె క్సాకొనజోల్ 400 మిల్లీలీటర్లు లేదా వేలిడామైసిన్ 400 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పంటకు పిచికారీ చేయా లని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మజ, రైతులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం

సీతంపేట: స్థానిక సంతోషిమాత ఆలయం శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం పందిరి రాట వేసి ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ అర్చకులు వేమకోటి సాయి కృష్ణ శర్మ తెలిపారు. అలాగే దోనుబాయి దుర్గాదేవి, మల్లి మల్లమ్మతల్లి ఆలయాల్లో దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు ఘనంగా చేశారు.

మొద్దునిద్రలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎలక్ట్రికల్ విభాగాలతో ముడిపడి ఉన్నాయి. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తప్ప మిగిలిన శాఖల సిబ్బంది తమ పనులు తాము చేసుకుంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం రోడ్డుకు అంతర్గాంగంలో వేయాల్సిన తాగునీటి పైపులైన్లను సక్రమంగా వేయకపోవడంతో రోడ్డు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. గత ఏడు నెలలుగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎక్కడ ఉన్నారో కూడా తెలియడం లేదని కాంట్రాక్టర్ అంటున్నాడు. తాగునీటి పైపులైన్లు త్వరగా అమర్చితే మిగిలిన బీటీ పనులు వేగంగా పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ అంటున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ పనులు త్వరగా పూర్తిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.



అంబేడ్కర్ జంక్షన్‌లో అరకొరగా చేపట్టి వదిలేసిన తాగునీటి పైపులైన్ పనులు

మూడు బృందాలతో బందోబస్తు

పాలకొండ: కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని డీఎస్పీ కృష్ణారావు సిబ్బందికి సూచించారు. డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ తొమ్మిది రోజుల పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఐదుగురు సీఐల పర్యవేక్షణలో సిబ్బందికి డ్యూటీలు వేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద, ఆలయం లోపల, ప్రధాన రహదారిలో మూడు బృందాలు బందోబస్తు విధులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఒక బృందం, రాత్రి మరో బృందం విధుల్లో ఉంటుందన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

ఊపందుకున్న రహదారి విస్తరణ పనులు

వీరఘట్టం: స్థానిక ప్రధాన రహదారి విస్తరణ పనులు నెమ్మదిగా జరుగుతుండడంతో రోడ్డుపై దుమ్ము, ధూళితో చాలా ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో స్థానికులు చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ స్పందించారు. సంబంధిత అధికారులతో, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో స్పందించిన అధికారులు, కాంట్రాక్టర్ శనివారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద కల్వర్టుల నిర్మాణం కోసం జేసీబీలతో మట్టిని తవ్వించారు. దుమ్ము, ధూళి ఎగరకుండా ఉదయం, సాయంత్రం రోడ్డుపై వాటరింగ్ చేయించారు. డిసెంబర్ నెలాఖరుకు పనులు పూర్తిచేస్తామని తెలిపారు.



అంబేడ్కర్ జంక్షన్‌లో కల్వర్టు నిర్మాణం కోసం జేసీబీతో మట్టి తవ్వుతున్న దృశ్యం

మూడేళ్ల కాలపరిమితి రద్దు చేయాలి

భామిని: వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు) పథకంలో పనిచేస్తున్న గ్రామైఖ్య సంఘ సహాయకులు(వీఓఏ)లకు మూడేళ్ల కాలపరిమితి రద్దు చేయాలని జిల్లా వీఓఏల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండగొర్రి అనూష, కోలక ధర్మరాజు డిమాండ్ చేశారు. భామిని హైస్కూల్ గ్రౌండ్‌లో పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల వీఓఏలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఏఓల సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించి పరిష్కరించాలని కోరారు. సీబీఓ హెచ్‌ఆర్ పాలసీని వర్తింప చేయాలని, ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, వీఓఏల మెర్జ్ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా కొండగొర్రి అనూష(గుమ్మలక్ష్మీపురం), ప్రధాన కార్యదర్శిగా కోలక ధర్మారాజు(భామిని), కోశాధికారిగా కురిమురి కుమారి(వీరఘట్టం), సహాయ కార్యదర్శిగా బిడ్డిక సరోజిని(సీతంపేట), పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.



మాట్లాడుతున్న వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనూష, ధర్మరాజు

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ

బొబ్బిలి: పట్టణంలోని స్కూళ్లు, కళాశాలల్లో సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలకు శనివారం వెళ్లి ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు తరగతులను నిలిపివేశారు. విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ ఒత్తిడితో కూడిన పాఠ్యాంశాల బోధన ఎంత వరకూ సమంజసమని జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ ప్రశ్నించారు. వెంటనే ఆయా విద్యాసంస్థలు తరగతులను నిలిపివేసి విద్యార్థులను పంపివేశారు.

సకాలంలో రేషన్ సరుకుల పంపిణీ

సీతానగరం: సకాలంలో రేషన్ సరుకుల పంపిణీ చేయాలని తహసీల్దారు ఎన్వీ రమణ సూచించారు. శనివారం మండలంలోని పెదబోగిలి గ్రామ సచివాలయం పరిధిలో చేపట్టిన నిత్యవసర సరుకుల(రేషన్) పంపిణీని పరిశీలించిన ఆయన సరిగ్గా తూసి బియ్యం, ఇతర సరుకులు ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా రేషన్ అందివ్వాలన్నారు. కొంతమంది రేషన్ వినియోగదారుల వేలిముద్రలు పడకపోవడంతో సరుకులు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్న ఫిర్యాదుల మేరకు ఒకే వ్యక్తి ఉన్న రేషన్‌కార్డుదారునికి సంబంధిత వలంటీరు వేలిముద్రను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వో పైల కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో భూముల రీసర్వేపై సమీక్షించిన తహసీల్దారు రమణ తొలి, రెండో విడత సర్వే పనులు పూర్తయ్యాయని, సోమవారం నుంచి మూడో విడత సర్వే చేయనున్నామన్నారు. ఈ విడతలో మొత్తం 21 గ్రామాల్లో సర్వే చేయనున్నామన్నారు. రామవరం, కృష్ణారాయపురం, లక్ష్మీపురం, బళ్ల కృష్ణాపురం, గుచ్చిమి, దయానిధిపురం గ్రామాల్లో భూముల రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ ప్రారంభించనున్నామన్నారు.



పెదబోగిలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దారు రమణ

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



పెదంకాలం గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా రక్షిత మంచినీటి పథకం



పనుకుపేటలో రంగులద్దుకున్న వాటర్ ట్యాంకు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఓ వైపు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చి ప్రజాసమస్యలు పరిష్కారం చేయడంతో పాటు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోంది. ముఖ్యంగా రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. మండలంలోని జానుమల్లువలస, లచ్చయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న సీసీ కాలువల నిర్మాణం, రక్షిత మంచినీటి పథకం, తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులను శనివారం పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ మాట్లాడుతూ త్వరితగతిన అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వజలధార నిధులతో మండలంలోని చెల్లంన్నాయుడువలస, పెదంకలాం, ఇప్పలవలస, కోటసీతారాంపురం గ్రామాల్లో ఒక్కో ఓవర్‌హెడ్ ట్యాంక్(వాటర్ ట్యాంక్) నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడం, పనులు పూర్తవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే చెల్లంన్నాయుడువలస, కె.ఎస్.పురం గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో ఓ వైపు పథకాలు అందుతుండడంతో పాటు అభివృద్ధి పనులు కూడా జోరుగా జరుగుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మట్టితో నిండిన అప్రోచ్ రోడ్లు

భామిని: మండలంలోని వంశధార వరద కాలువలపై నిర్మించిన వంతెనల అప్రోచ్ రోడ్లల్లో వాహనదారుల కష్టాలు కొనసాగుతున్నాయి. వరద కాలువలపై నిర్మించిన వంతెనల అప్రోచ్‌లను సంబంధిత కాంట్రాక్టర్లు మట్టితో పూడ్చడంతో వాహనాలు రాకపోకలు చేసే సమయంలో దుమ్ము ఎగసిపడుతోంది. బిల్లుమడ, అనంతగిరి, సతివాడ, కొరమ గ్రా మాల వద్ద వంతెనలు నిర్మించి ఐదేళ్లయింది. అయి తే వంతెన అప్రోచ్‌లను మట్టితో పూడ్చి కాంట్రాక్ట ర్లు చేతులు దులుపుకున్నారు. దుమ్ము, ధూళి ఎగసిపడుతుండడంతో పాటు వర్షాలకు మట్టి కరిగిపోవడం, బురదగా మారడంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వారంతా ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు.



మట్టితో నిండిపోయిన బిల్లుమడ వంతెన అప్రోచ్ రోడ్డు

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

● జిల్లా మత్స్య శాఖ అధికారి వేములు తిరుపతయ్య



సాలూరు:

మత్స్యకారులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోందని, జిల్లాలోని అన్ని మత్స్యకార సంఘాలకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చొరవతో సబ్సిడీపై చేపపిల్లలు పంపిణీ చేస్తున్నామని జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య తెలిపారు. శనివారం స్థానిక పట్టణంలోని విలేకరులతో మాట్లాడిన ఆయన జీవో నంబరు 106 కింద జిల్లాలో 48 మత్స్యకార సంఘాల్లోని 4,600 మందికి దాదాపు 10 లక్షల చేపపిల్లలు అందించినట్లు పేర్కొన్నారు. దీనికి రూ.16 లక్షలను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. నవంబరు 21వ తేదీన ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా బోట్లు, వలలు తదితర సామగ్రిని మత్స్యకారులకు అందివ్వనున్నామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 68 ఫిష్ ఆంధ్రా యూనిట్లు మంజూరయ్యాయని, 60 షాపులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఒక్కో షాపునకు రూ.1.75 లక్షల నుంచి రూ.3.25 లక్షల రుణం బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం మేర బీసీ మహిళలకు 40 శాతం సబ్సిడీ మేర రుణాలు మంజూరు చేశామన్నారు.



సాలూరు పట్టణంలోని పేరసాగరం చెరువులో చేపపిల్లలు విడిచిపెడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చేపపిల్లల విడుదల..

సాలూరు: స్థానిక పట్టణ పరిధిలోని పేరసాగరం చెరువులో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు సూరిబాబు చేతులమీదుగా శనివారం చేపపిల్లలు విడిచిపెట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గిరి రఘు, రాపాక మాధవరావు, గొర్లె వెంకటరమణ, పప్పల లక్ష్మణ, టిక్కలి ధర్మారావు, అచ్చిబాబు, పట్టణ మత్స్యకార సంఘ అధ్యక్షుడు పాండ్రంకి జోగారావు తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంట: చేపపిల్లలు విడుదల చేస్తున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోందని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని పెద్దగెడ్డ జలాశయంలో ఆమె చేతులమీదుగా శనివారం చేపపిల్లలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య యోజన పథకం కింద 1,47,600 చేపపిల్లలను విడుదల చేశామని, ఈ పెద్దగెడ్డ జలాశయం ద్వారా 200 మంది గిరిజన మత్స్యకార రైతులు, చేపలవేట కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రతీ మత్స్యకార రైతుకు పెన్షన్ ఇస్తోందని, చేపలవేటకు వెళ్లేటప్పుడు ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే వైఎస్సార్ మత్స్యకార బీమా కింద రూ.10 లక్షలు అందిస్తోందన్నారు. ఇదే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ తిరుపతయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలకు కేరాఫ్ రామభద్రపురం

రామభద్రపురం: ఆకుకూరల సాగుకు రామభద్రపురం కేరాఫ్‌గా మారింది. తక్కువ వ్యవధిలోనే పంట చేతి కందుతుండటం .. నీటి వసతి ఎక్కువగా అవసరం లేకపోవడంతో రైతులు ఆకుకూరల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. పంచాయతీలో సుమారు 700 వరకు కూరాకుల కులస్తుల కుటుంబాలు ఉన్నాయి. వీరంతా పూర్వికుల నుంచి కూరగాయల సాగే జీవనాధారంగా చేసుకుని వస్తున్నారు. తోటకూర, పాలకూర, మెంతాకు, గోంగూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీన తదితర ఆకుకూరలను సాగుచేస్తూ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో విక్రయిస్తూ, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.



మార్కెట్‌లో విక్రయించేందుకు ఆకుకూరలు తీసుకెళ్తున్న రైతులు